# చరిత్రకందని ప్రేమకథ

'లత'



"రాజా మనం బయలుదేరి చాలా రోజు లయింది. ఏమిటి యీ తిరుగుడు? నిక్షేపంగా యిల్లుంటే ఆ వూరు ఆ వూరు తిరుగుతూ యీ హోటళ్ళలో నెలల తరబడి చావడం ఏమిటి? ఏమో నీకు ఎలా ఉందోగాని నాకు మాత్రం ఏమీ బాగుండలేదు. సంసారులమా గుండ కొయ్యలమా ... చిన్నాణ్ణి చూడాలని వుస్తోంది. యీ వూరంతా చూశాముగా — రాత్రి బయల్దేరి వెళ్ళిపోదాము."

"ఎప్పుడూ యిల్లో యిల్లో ఒకటే గోల ... కొంపకి చేరకేమవుతాము. పిల్లలంటామా వాళ్ళకు మనం లేకపోతే స్వేచ్ఛ. అయినా రేపు ఒక్కరోజు ఆగు. తిరుగు ముఖం పడదాము. ఎన్నాళ్ళనుంచో కోరిక - పుస్తకాల్లో చదవడం తప్ప స్వయంగా చూళ్ళేదు. రానే వచ్చాముగదా అదేమిటో చూసిపోదాము."

"ఏమిటండీ అంత చూడాల్సింది."

"ఒక పక్షి"

"పక్షా...ఏడిసినట్టుంది"

"పక్షే అద్భుతమైనది."

"ఎక్కడ కనపడుతుందేమిటి?"

"ఒక యిరవై మైళ్ళు ప్రయాణంచెయ్యాలి. పద బయల్దేరు."

రాజారావు రమణి పూనానుండి బయలుదేరి బస్సులో పడి సాయంకాలానికి యిరవై మైళ్ళ దూరంలో వున్న పాపక్ అనే వూరు చేరారు. అదో చిన్న పల్లెటూరు. మరాటీ తప్ప ఏమీ మాట్లాడలేరు ఆ వూళ్ళోవాళ్ళు. వీళ్ళకు మరాటీరాదు. రమణికి విసుగ్గా వుంది. బస్సు దిగటం ఆలస్యం మంచినీళ్ళో అని గోల. రాజారావుకు రమణి ప్రవర్తనచూస్తే ఒళ్ళు మండుతోంది. యిదిమామూలే. హిందీ మరాటీ కలిపి మాట్లాడితే ఒకరైతు అర్థం చేసుకుని మంచినీళ్ళు యిచ్చాడు. ఆ వూరు ఎందు కొచ్చారని అడిగాడు. రాజారావు మస్తానీ సమాధి చూపించమని కోరాడు. వెంటనే కళ్ళనీళ్ళు తుడుచుకుని చూపిస్తానని బయలు దేరాడు. రమణి విసుక్కుంటూ నడవడం అలవాటు లేకపోవడంవల్ల తిట్టుకుంటూ బయలుదేరింది. ఊరు చివరకు తీసుకొచ్చి రెల్లుగడ్డితో పెనవేసుకుపోయి శిధిలమయిన సమాధి దగ్గరకు తీసుకు వెళ్ళి యిదేనని చూపించాడు. కొంచంసేపు చూసి అక్కడే చతికిలబడ్డాము. యింతలో ఒక పక్షివచ్చి ఆ సమాధిమీద వాలింది.

"మస్తానీ! మస్తానీ!" అని రైతు నిట్టూర్చడం ప్రారంభించాడు. పక్షినిచూసి మస్తానీ అంటాడేమిటి అనిపించింది వాళ్ళకు.

ఆ పక్షే మస్తానీ అని చెప్పాడు రైతు. ఏమేవిటో మరాటీలో చెప్పాడు గాని వాళ్ళకేం బోధపడలేదు. ఆ పక్షి మాత్రం చూడ్డానికి చాలా అందంగా వుంది. నెత్తిమీద పింఛం బంగారం ఎరుపు రంగులతో చాలా ముచ్చటగా వుంది. దాని అరుపు వింటే ఏదో దుఃఖంతో కూడిన మూలుగులాగా వుంది.

"ఏమిటండీ! యీ గోల పోదాం" నాకేం బాగుండలేదు అంది రమణి.

కాదు దీని వెనకాల పెద్ద కథ వుంది. యీ సమాధి దగ్గర ఆ పక్షిని చూస్తుంటే నిజంగా మస్తానీ తిరిగి యీ పక్షిగా జన్మ ఎత్తిందేమో అనిపిస్తుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో వాళ్ళంతా ఆ పక్షి మస్తానీ అనే తలుస్తారు.

"ఆ మస్తానీ ఎవరండీ?" అంది రమణి.

నువ్వు చరిత్రలోగాని నవలల్లోగాని ఆ కథ ఎప్పుడూ వినలేదా? బాజీరావు మస్తానీల ప్రణయగాథ ఇది విను!

. ○ ○ ○ ○

అది మహారాష్ట్రుల స్వర్ణయుగము! శివాజీ తరువాత అంతటివాడని పించుకున్న మొదటి పీష్వా బాజీరావు కాలం! మహా యోధుడేగాక గొప్ప పరిపాలనా దక్షుడు! పరిపాలనా దక్షుడే కాదు దాత! దయార్ద్ర హృదయుడు... గొప్ప

ప్రేమికుడు ... ప్రియురాలికోసం తపించి ప్రాణత్యాగం చేసుకున్నవాడు! మొగలులకు సింహస్వప్నం! మస్తానీ బాజీరావుల కలయిక చిత్రమైనది చరిత్ర ప్రసిద్ధమైనది! అమర మైనది! వారి ప్రేమగాథ మహారాష్ట్ర దేశంలో జానపదులు పాడుకుంటూ వుంటారు! ప్రేమంటే వారిదే!

ఔరంగజేబు 1661 లో బుందేల్‌ఖండ్ పాలకుడైన చంపత్‌రాయ్‌ని ఓడించి తన సామ్రాజ్యంలో కలిపేసుకున్నాడు! చంపత్‌రాయ్ కొడుకైన ఛత్రసాలుడు రాజా జయసింగు దయవల్ల మొగల్ సైన్యంలో చిన్న సైన్యాధిపతిగా చేరాడు! పురంధర్ కోట ముట్టడిలోనూ, దేవగడ ముట్టడిలోనూ తన ప్రతాపం చూపించి శభాష్ అనిపించుకున్నాడు! కాని యీ మెప్పులు అతనికి నచ్చలేదు! అతని ఆశయం ఒక్కటే. అదే బుందేల్ ఖండ్‌ను స్వతంత్ర రాజ్యంగా చెయ్యడమే. అందుకోసం శివాజీని సహాయం కోరాడు! శివాజీ అతడిని తన రాజ్యానికి వెళ్ళి మొగలులను తరిమివేయమన్నాడు! దానికి తగ్గట్టుగానే ఔరంగజేబు హిందూ దేవాలయాలు నేలమట్టం చెయ్యడం ప్రారంభించాడు! మాళవ బుందేల్ ఖండ్ ప్రజలు ఛత్రసాలుని నాయకుడిగా చేసుకొని మొగలు సైన్యాలమీదికి లంఘించారు! తరిమివేశారు! మొగలులను తరిమివేయుటలో పీష్వా బాజీరావు ఛత్రసాలుడుకు సహాయంచేసాడు!

బుందేల్‌ఖండుము స్వతంత్ర రాజ్యమైనది. బాజీరావు చేసిన సహాయమునకు కృతజ్ఞతగా అనేక కానుకలు పంపాడు- వెలలేని కానుక మస్తానీ అనే ముస్లిమ్ నాట్యరాణి-ఆమె తండ్రి ఉన్నతవంశీయుడైన హిందువు తల్లి ఒక ముస్లిమ్ నాట్యగత్తె-మస్తానీ అపురూపసుందరి-కళలకు నిధి-ఆమె అందము చూచినవాడెవడైనా ఆమెకు బానిస కావలసిందే- ఆమెకు విలాసజీవితం కంటే సతీత్వం మీదనే వాంఛ-మస్తానీ బాజీరావులను భగవంతుడు ఒకచోటికి చేర్చాడు-మస్తానీ చిరకాలవాంఛ తీరింది- మస్తానీ బాజీరావు విడిదికి చేర్చబడింది-

మస్తానీ యింతవరకూ నీ అంతటి సౌందర్యరాశిని చూడనేలేదు, నా భార్య కాశీబాయి తప్ప పరస్త్రీ సాంగత్యమే ఎరుగను. నిన్ను చూడగనే బ్రహ్మదేవుడు యింత తెలివిగలవాడా అనిపిస్తోంది. నువ్వు నా జీవితానికి గర్వకారణం. నా కంటికి వెలుగు." అంటూ తన బాహువల్లరిలో బంధించాడు.

మస్తానీ కేవలం అతని పురుషాకృతిని ఒకసారి ఆపాదమస్తకం చూచి తల వాల్చి అతని ఛాతిమీద వాలిపోయింది. అంతే బాజీరావుకు మస్తానీతోటిదే లోకం. మస్తానీ ఆయన సాంగత్యసేవా తప్ప మరో ఆలోచనే లేదు. బాజీరావు బాధ్యతగల పరిపాలకుడనే విషయమే మరిచిపోయింది. రాజ్య వ్యవహారాలు పాడయినయ్. మస్తానీ వేషభాషల్లో, తిండితిప్పల్లో పూర్తి హిందూస్త్రీగా మారిపోయింది బాజీరావు సమక్షం తప్ప ఆమెకు ఏమీ అక్కరలేకపోయింది. బాజీరావు తాగి మాంసాహారం తినడం, రాజ్య వ్యవహారాలు పూర్తిగా వదిలివెయ్యడం చాలామందికి తీవ్ర కోపకారణమయింది

బాజీరావు భార్య కాశీబాయి చాలా వివేకవంతురాలు. మస్తానీని చూసి అసూయపడి ప్రయోజనం లేదనుకుంది. బాజీరావు సుఖమే తన సుఖమనుకున్నది. వారిద్దరినీ వేరు చెయ్యడంవల్ల మేలుకంటే కీడే ఎక్కువని భావించి మస్తానీని తన స్వంత సోదరిలాగా చూడ్డం మొదలుపెట్టింది. కాలం, పరిస్థితులు ఒక విధంగా వుండవుగా కాశీబాయి కొడుకు రఘునాథరావు, మస్తానీ కొడుకు షంషేర్ బహదూర్; రఘోబాకు లభించిన హక్కులూ ఆదరణ షంషేర్ బహద్దూరుకు లభించడంలేదు. దాంతో ఆరంభమయినాయి కలతలు. రఘోబాతోబాటు షంషేర్‌కు కూడా ఉపనయనం చెయ్య తలపెట్టాడు బాజీరావు. కులపెద్దలు వీలులేదన్నారు. దాంతో బాజీరావు వాళ్ళమీద మండిపడ్డాడు. వాళ్ళనందరినీ శిక్షించడానికి తలపడ్డాడు. మస్తానీని తన భార్యతో సమానంగా గౌరవించాల్సిందే నన్నాడు. తన మతాన్ని స్వీకరించి తన పద్ధతుల ననుసరించినభార్యను తన మొదటిభార్యతో సమానంగా చూడాలన్నాడు. యిదే వేదాల్లో నాటి పద్ధతని వాదించాడు పండితులు మూర్ఖులని నిందించాడు. రఘోబాతోపాటు షంషేరుని తన కొడుకైనప్పటికీ సమానంగా చూడలేకపోయినందుకు కుమిలిపోయాడు.

దాంతో ప్రతీకారంగా రాజ్యవిషయాలు మానేశాడు. శత్రువులు దండెత్తి వస్తున్నా పట్టించుకోలేదు; దాంతో మిగతా మంత్రులు ఉద్యోగులు బాజీరావు ఉపేక్షకు మస్తానీయే కారణం అని భావించి కుట్రపన్ని ఒకనాడు అర్ధరాత్రి మస్తానీని ఎత్తుకుపోయి పూనాకోటలో జైల్లో వుంచారు. మస్తానీజాడ తెలియని బాజీరావు విధిలేక యుద్ధానికి వెళ్ళి జయించి తిరిగొచ్చాడేగాని మస్తానీని మరువలేక పోయినాడు మంత్రులు అంతటితో ఆగక వైద్యంఅనే వంకతో దూర ప్రాంతానికి తీసుకు పోయారు, భర్త పరిస్థితి చూసి కాశీబాయి భర్తను చాలా శ్రద్ధగా కనిపెట్టివుంది- భర్తరాత్రింబవళ్ళు 'మస్తానీ' అని పలవరిస్తుంటే మస్తానీకోసం వెదికించింది- సంధిలో భార్యనే మస్తానీగా భావించి మస్తానీయే ఏదో మంత్ర ప్రభావం వల్ల తన దగ్గరకు వచ్చిందని గట్టిగా కౌగలించుకొని తనని వదలివెళ్ళవద్దని కేకలు పెట్టేవాడు. కాశీబాయి తనభర్త తనవాడుకాదని తెలుసుకుంది ఆ సమయం రానేవచ్చింది- మహాయోధుడు; రాజకీయ ధురంధరుడు, పరిపాలనా దక్షుడూ శివాజీ అంతటివాడు మహారాష్ట్రజాతి ఉద్ధారకుడు భౌతిక శరీరాన్ని మస్తానీ నామస్మరణతో చాలించాడు-కాశీబాయి తన చిన్నకొడుకు జనార్దనుని చేత కర్మకాండలు పూర్తిచేయించి తీర్థయాత్రలకు కాశీవెళ్ళిపోయింది-

బాజీరావు జబ్బువిషయం తెలిసిన మస్తానీ జైలుకాపలావానికి హెచ్చుమొత్తం లంచం యిచ్చి తప్పించుకొని బాజీరావును కలుసుకోవడానికి ప్రాణాలకు తెగించి బయలుదేరింది- చికండు అరణ్యప్రాంతం చేరేటప్పటికి బాజీరావు మరణవార్త ఆమెకు తెలిసింది. అప్పటికే ప్రయాణంవల్ల అలసిపోవడం, బాజీరావు మరణవార్త చెవులబడగానే అక్కడే కూలబడి ప్రాణాలొదిలింది-తన ప్రియుణ్ని కలుసుకోవడానికి మస్తానీ శవాన్ని అక్కడ నుంచి పాపల్ గ్రామానికి తీసుకువచ్చారు- సమాధి ఏర్పాటు చేశారు- యీ విధంగా బాజీరావు మస్తానీల ప్రేమగాథ విషాదాంతంగా ముగిసింది- లైలామజ్నూ, షిరీన్‌ఫరహాద్, బాజీరావు మస్తానీ ప్రపంచంలో ప్రేమగాథలన్నియింతే!! రాజారావు కథ అయిపోయింది రమణినిట్టూర్పు పక్షికూతా కలిసిపోయినయి-